www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం


శుక్రవారం 07.03.2025

విలేఖరులు కావలెను



కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003




- ఎస్సీ వర్గీకరణ ముసాయిదాకు తుది మెరుగులు
- కేబినెట్ సమావేశం పలు నిర్ణయాలు
- ఈనెల 12 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- 27 వరకు కొనసాగనున్న సమావేశాలు
- ఉగాది నుంచి భూభారతి అమలు చేయాలని నిర్ణయం
- ఫ్యూచర్ సిటీ కోసం కొత్త బోర్డు ఏర్పాటు


2లో



# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

కొత్తగా 10,950 విలేజ్ లెవల్ ఆఫీసర్ పోస్టులు

కేబినెట్ ఆమోదం



# ఘోర రోడ్డు ప్రమాదం

6లో

- మిర్చి ఏరేందుకు కూలీలు వెళ్తుండగా ట్రాలీలో బోల్తా
- ఒక్కరు మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం
- ప్రమాద సమయంలో ట్రాలీలో 40 మంది కూలీలు
- మరో 20 మందికి స్వల్ప గాయాలు
- వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలో ఘటన



## పెండింగ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

### రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**కలంజ్యోతి, రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో పెండింగ్ రహదారుల, భవనాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రోడ్లు భవనాల శాఖ పరిధిలో పెండింగ్ రోడ్లు మరియు భవనాల పనుల పురోగతి పై ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ... జిల్లాలో రోడ్లు బోనాల శాఖ పరిధిలో 12 రోడ్లు, 8 భవనాలు (వైద్య కళాశాల తో సహా), 7 బ్రిడ్జిల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు.రోడ్డు భవనాల శాఖ పరిధిలో పెండింగ్ రహదారి పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు ఏదైనా తాత్సారం ఉంటే వివరాలు అందించాలని, ప్రభుత్వానికి లేఖ రాసి బిల్లుల చెల్లింపు త్వరగా జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో జరుగుతున్న ప్రతి రోడ్డు నిర్మాణ స్థితిగతుల గురించి వివరాలు తెలుసుకున్న కలెక్టర్ వాటిని వేగవంతంగా పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యల పలు సూచనలు చేశారు. ప్రస్తుత త్వరగా పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చే రోడ్డు నిర్మాణ పనులు ప్రాధాన్యతతో చేపట్టాలన్నారు. రోడ్డు నిర్మాణ పనులకు ఎక్కడ ఇసుక సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, నాణ్యత ప్రామాణాలు తో చేపట్టాలని అన్నారు. వీర్నపల్లి దగ్గర పాఠశాల సమీపంలో సి.సి రోడ్డు నిర్మాణానికి అవసరమైన ఇసుక కేటాయింపులు చేయాలని కలెక్టర్ సంబంధిత తహసిల్దార్ కు చరవాణిలో ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల కోడ్ కూడా ముగిసిందని అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి పనులు వెంటనే జరిగేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. కాంట్రాక్టర్ల తో చర్చలు జరిపి పనులు క్షేత్రస్థాయిలో త్వరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలని అన్నారు.డి.ఎం.ఎఫ్.టి పరిధిలో పెండింగ్ ఉన్న బిల్లుల వివరాలను సమర్పించాలని , వెంటనే చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

**అభివృద్ధి పనులకు నిధులు..**

166 కోట్లతో చేపట్టిన వైద్య కళాశాల పనులు పురోగతిలో ఉన్నాయని వీటిని నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు, అన్నదాన సత్రం, ఎల్లారెడ్డిపేట మండలంలోని వీర్నపల్లి వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ముస్తాబాద్ మండలంలో తహసిల్దార్ కార్యాలయం నిర్మాణం , కోర్టు భవనాల నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ వెంకటరమణయ్య, డి. ఈ.లు శాంతయ్య, కిరణ్ కుమార్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

**కలంజ్యోతి, హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో గురువారం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన 6 గంటలుగా కేబినెట్ సమావేశం సాగింది. క్యాబినెట్ లో అసెంబ్లీ సమావేశాలపై చర్చ జరిగింది. అసెంబ్లీ సమావేశ తేదీల ఖరారు అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి మంత్రుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈనెల 12 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 27 వరకు సమావేశాలు కొనసాగనున్నాయి. అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ .. బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టనున్నారు. ఉగాది నుంచి భూభారతి అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఫ్యూచర్ సిటీ కోసం కొత్త బోర్డు ఏర్పాటు చేయాలని సంకల్పించారు. నదీ జలాల అంశంపై ప్రత్యేక కమిటీ వేయాలని నిర్ణయించారు. నిరుద్యోగులకు సైతం శుభవార్త చెప్పారు. కొత్తగా 10,950 విలేజ్ లెవల్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలకు 217 పోస్టులు మంజూరు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఎస్సీ కులాల వర్గీకరణ ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. న్యాయ పరమైన చిక్కులు లేకుండా న్యాయ నిపుణుల సలహాలతో బిల్లు ముసాయిదాకు తుది మెరుగులు దిద్దాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

**రెవెన్యూ శాఖ బలోపేతానికి ..**

రెవెన్యూ శాఖ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం చెప్పినట్టుగానే రాష్ట్రంలోని ప్రతి గ్రామానికొక క్షేత్రస్థాయిలో అధికారి ఉండేలా క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇదే కాకుండా కొత్తగా ఏర్పడిన డివిజన్లు, మండలాలకు సైతం కొత్తగా పోస్టులను మంజూరు చేసింది. రాష్ట్రంలో కొత్తగా 10,950 విలేజ్ లెవెల్ ఆఫీసర్



పోస్టులు మంజూరు చేస్తూ ఆమోదం తెలిపింది. కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త మండలాలకు 217 పోస్టులు మంజూరు చేస్తూ మంత్రివర్గం తీర్మానం చేసింది. అలాగే 10 జిల్లా కోర్టులకు 55 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ కేబినేట్ ఆమోదం తెలిపింది. వీటితో పాటు సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులకు సైతం ఆమోద ముద్ర వేసింది. రాష్ట్ర క్యాబినేట్ నిర్ణయం పట్ల డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్(డీసీఏ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్‌పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 10,950 గ్రామాలకు క్షేత్ర స్థాయి అధికారుల నియమానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, కొత్త డివిజన్లు, మండలాలకు 217 పోస్టుల మంజూరు, 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు సైతం క్యాబినేట్ ఆమోదం తెలుపడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, ఇతర మంత్రులకు, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో రెవెన్యూ శాఖ బలోపేతంతో పాటు క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సేవలు రైతులకు, ప్రజలకు మరింత చేరువ అవుతాయన్నారు. దూరాభారం తగ్గుతుందన్నారు. సేవలు వేగంగా అందుతాయన్నారు.

**ఎస్సీ వర్గీకరణ ముసాయిదాకు తుది మెరుగులు**

ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయ నిపుణుల సలహాలు తీసుకుని ముసాయిదా బిల్లుకు తుది మెరుగులు దిద్దాలని, న్యాయపర చిక్కులు లేకుండా చూడాలని సూచించారు. కాగా, మాల, మాదిగ, దక్కలి.. ఇలా తెలంగాణలో 59 ఎస్సీ కులాలు ఉన్నాయి. ఆ జాబితాలోని కులాలకు ప్రభుత్వ విద్య, ఉద్యోగాల్లో కొంత శాతం వరకు రిజర్వేషన్ ఉంటుంది. తెలంగాణలో అది 15 శాతం ఉంది. అంటే వందలో 15 ఉద్యోగాలు ఈ కులాలకు చెందిన వారికే ఇస్తారు. అయితే ఆ జాబితాలోని కులాల మధ్య కూడా అసమానతలు ఉన్నాయి. అందులో కొన్ని కులాలు ముందున్నాయి. మరి కొన్ని కులాలు వెనుకబడి ఉన్నాయని ఆయా కులాలు చెబుతూ వచ్చాయి. దీనివల్ల ఎస్సీలకు మొత్తంగా ఇచ్చిన రిజర్వేషన్లను కొన్ని కులాలే ఉపయోగించుకుని ముందుకు వెళ్తున్నాయనీ, మిగతా వారు వెనుకబడే ఉంటున్నారనీ ఇతర కులాలు ఆరోపిస్తూ వస్తున్నాయి. అందుకే ఎస్సీలకు ఇచ్చిన 15 శాతం రిజర్వేషన్‌ను తిరిగి, కులాల మధ్య విభజించి పంచాలనే డిమాండ్ వినిపించింది. ప్రధానంగా రిజర్వేషన్ ఫలితాలు మాలలు వారు ఎక్కువ అనుభవించారు కాబట్టి ఎస్సీ కులాలను వర్గీకరణ జరపాలంటూ మాదిగలు పోరాడారు.

## విద్యార్థులకు స్టేషనరీ అందజేత

### దాతృత్వం చాటుకున్న సంగెం గాంధీ

కలంజ్యోతి, చెన్నారావుపేట : వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జల్లి గ్రామానికి చెందిన సమాజ సేవకుడు సంగెం గాంధీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, స్టేషనరీ అందజేశారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం సరళ, ఉపాధ్యాయులు సాగర్, గ్రామ యువకులు జక్క రవి, దేసిటి రాకేష్, కాసాన అశోక్, ఎన్ హెచ్ ఆర్సీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘం రమేష్, తుమేటి మధు, సంఘం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# వందశాతం ఫలితాలకు కృషి చేయండి

## కలెక్టర్ అభిలాష అభినవ్



**కలంజ్యోతి, నిర్మల్ :** మూడో వారంలో ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో పదవ తరగతి పరీక్షలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో జిల్లాలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లా మొదటి స్థానంలో నిలుస్తూ వచ్చిందని, ఈ సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తూ బోర్డు పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. నిరంతరం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. పరీక్షల కోసం సన్నద్ధానికి ప్రత్యేకంగా సమయసారిణి రూపొందించాలన్నారు. విద్యార్థులను మానసికంగా దృఢంగా చేసి పరీక్షలపై భయాన్ని తొలగించాలని తెలిపారు. పాఠాలను సులభంగా గుర్తుంచుకునే విధంగా మెలుకువలు నేర్పించాలన్నారు. సబ్జెక్టుల వారిగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులచే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున వంద శాతం విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, తరచూ పాఠశాలకు హాజరు కాని విద్యార్థులను గుర్తించి ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులతో మాట్లాడి తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు అధికారులు, ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతానికి సంబంధించిన వివరాల నివేదికలను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. మార్కులను సులువుగా సాధించేందుకు అవకాశం ఉన్న గ్రాఫ్, టేబుల్స్, పటాలు, తదితర విషయాలలో విద్యార్థులకు మెలుకువను నేర్పించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఈఓ పి. రామారావు, ఎంఈఓలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీల ప్రత్యేక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సిటీ పోలీస్ యాక్ట్ అమలు

## జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్



**కలంజ్యోతి, జగిత్యాల :** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల (మార్చి 1వ తేది నుండి 31 వరకు పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. యాక్ట్ ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించొద్దని హెచ్చరించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టొద్దని సూచించారు. జిల్లా ప్రజలు పోలీసు వారికి సహకరించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.



# ఇగ్నో నుంచి డిగ్రీ నర్సింగ్ పట్టా అందుకున్న మల్లీశ్వరి

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండలంలోని ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రంలో నర్స్ గా సేవలు అందిస్తున్న మల్లీశ్వరి ఇగ్నో యూనివర్సిటీ నుండి బ్యాచులర్ ఆఫ్ సైన్స్ (నర్సింగ్) డిగ్రీ పట్టా అందుకు న్నారు. మల్లీశ్వరి బాచిలర్ ఆఫ్ డిగ్రీ కిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ హైదరాబా ద్ లో ఉన్నత విద్యని అభ్యసించి, ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) ద్వారా టీఎస్పీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం చేతుల మీదుగా డిగ్రీ పట్టాని అందుకున్నారు. ఖమ్మం జిల్లా మారుమూల గ్రామం నుండి ఉద్యోగరీత్యా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో 'నర్స్'గా విశిష్ట సేవలు అందిస్తూ పలువురి మన్ననలు పొందింది. నర్సింగ్ లో ఎలాగైనా డిగ్రీ పట్టా పొందాలనే తలంపుతో ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీలో చేరి దూరవిద్య ద్వారా బీఎస్సీ (సైన్స్) నర్సింగ్ డిగ్రీ పట్టా అందుకున్నారు. పట్టా అందుకున్న మల్లీశ్వరిని వైద్య సిబ్బంది అభినందించారు.

# బీజేపీ సంబురాలు



**కలంజ్యోతి, నర్సాపూర్ :** ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ నియోజకవర్గాలకు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి చిన్నమైల్ ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గంలో చిలిపిచెడు మండల కేంద్రంలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో శ్రేణులు విజయోత్సవలు నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ అధికార పార్టీ అయినా కాంగ్రెస్ కు ఈ విజయం ఒక చెంపపెట్టు లాంటిదన్నారు. ఇప్పటికైనా ఆదమరిచి నిద్రపోయే వ్యవస్థను మానుకొని ఇచ్చిన వాగ్దానాలను ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ కు గట్టి ఎదురుదెబ్బలా బీజేపీ విజయకేతనం ఎగరవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మండల కార్యదర్శి మహేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శంకర్, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు అశోక్, సిద్ది రాములు, మహిపాల్, శేఖర్, రాజాగౌడ్, భిక్షపతి, పెంటే నాయక్, మాజీ అధ్యక్షులు యాదగిరి కుమార్, యాదగిరి, బాబీ, బీరప్ప, శేఖర్, రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



### అంజిరెడ్డి గెలుపుతో సంబురాలు

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** భారతీయ జనతా పార్టీ భీమదేవరపల్లి మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై పార్టీ నాయకులు పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు చేసుకున్నారు. నరేందర్ రెడ్డి ఓటమికి మంత్రి పొన్నం ప్రభాకర్ బాధ్యత వహించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్లలో కూడా సేమ్ సీన్ రిపీట్ అవుతుందన్నారు.. మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డిని గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షులు పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్, దొంగల కొమురయ్య, గండు సారయ్య, మాచర్ల కుమారస్వామి, ఊసకోయిల కిషన్, అంబీర్ కవిత, దొంగల వేణు, బొజ్జపురి పృధ్వీరాజ్, దొంగల రాణా ప్రతాప్, కంకల సదానందం, లక్కిరెడ్డి మల్లారెడ్డి, అయిత సాయి తేజ, బొల్లంపల్లి శ్యామ్, కాలేరు వికాస్, సింగం రాజేందర్, చొప్పరి నవీన్, గద్ద రాజేందర్, బైక్అని అఖిల్, సిద్ధమల్ల రమేష్, వేముల ప్రసాద్, ఆవుల శ్రీనివాస్, మొండెద్ల ఉదయ్, తాళ్లపల్లి రవిచంద్, జనగాని కుమారస్వామి, చార్మిత, సంజయ్ పాల్గొన్నారు.



# మేల్ నర్సింగ్ గా సేవలు అందిస్తూ డిగ్రీ అందుకున్న సాతూరి సుమన్

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండల కేంద్రానికి చెందిన సాతూరి సుమన్ ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగంలో సేవలు అందిస్తూ, ఉన్నత చదువులు చదువుకోవాలనే దృఢ సంకల్పంతో బాచిలర్ ఆఫ్ డిగ్రీ కిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ హైదరాబాద్ లో ఉన్నత విద్యని అభ్యసించి ఇగ్నో దూరవిద్య ద్వారా టీఎస్పీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం చేతుల మీదుగా డిగ్రీ పట్టాని అందుకున్నారు. భీమదేవరపల్లి గ్రామానికి చెందిన సుమన్ మొట్టమొదటిసారిగా పురుషుల విభాగంలో 'మేల్' నర్సింగ్ గా వరంగల్ ఎంజీఎంలో పనిచేశారు. ప్రస్తుతం పరకాల ప్రభుత్వాస్పత్రిలో సేవలు అందిస్తున్నారు. సుమన్ డిగ్రీ పట్టా పొందడం పట్ల గ్రామస్తులు, ఏకేవీఆర్ కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.



# అర్హులైన వారందిరికీ ఇళ్లు

## పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**కలంజ్యోతి, గీసుగొండ :** అర్హులైన వారందిరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మండలంలోని కొనాయమాకుల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి, భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమథకాలు అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులకు రూ.5 లక్షల వరకు ఆర్థికసాయం అందజేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించామన్నారు. ఇండ్ల కోసం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు మంజూరు చేస్తామని రేవూరి భరోసా ఇచ్చారు.



# పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

**కలంజ్యోతి, గీసుగొండ :** మండలంలోని శాయంపేట(హ) గ్రామంలో కాంగ్రెస్ నాయకులు దాడి శ్రావణ్, శివ పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు అందజేశారు. అలాగే ఇటీవలే ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణుడైన అల్లం రాంచరణ్ ని కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు జూల రమేష్, దాడి శివ సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉప సర్పంచ్ రాజబోయిన రజిత భిక్షపతి, జూల చంద్రమోహన్, గౌడ సంఘం అధ్యక్షులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పులి వెంకటేశ్వర్లు, గాలి వీరయ్య, ముంత సూర, పాపయ్య, నీరటి కుమార్, రాకం అశోక్, సముద్రాల అనిల్, నీరటి రాజు, గాలి యాకయ్య, కొంగర హరీష్, అల్లం సుమన్, సుధామళ్ళ పవన్, కొమ్ము రాజేష్, తాళ్లపెల్లి వెంకటేష్, తాళ్లపెల్లి రాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి మహేష్, కొమ్ము అభిరామ్, పొన్నాల మహేందర్, సముద్రాల వేణు, కొంగర గౌరేష్ పాల్గొన్నారు.




# పేకాట రాయుళ్ల అరెస్టు

**కలం జ్యోతి, నిర్మల్:** నిర్మల్ జిల్లా భైంసా రూరల్ వాటోలి గ్రామ సమీపంలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తుల్ని బ్లూ కోల్ట్ సిబ్బంది స్వప్న, రజిత గురువారం పట్టుకున్నారు. వారివద్ద నుంచి రూ.3,500 స్వాధీనం చేసుకున్నారు.

# మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

## కలెక్టర్ బి.సత్య ప్రసాద్

**కలంజ్యోతి, జగిత్యాల:-**
మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలతో దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. మహిళలకి సమానమైన హక్కులతోపాటు ప్రత్యేకమైన చట్టాలను కూడా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. గృహ హింస నిరోధక చట్టం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ చట్టం, నిర్భయ చట్టం, వంటి చట్టాల ద్వారా మహిళలు వారి యొక్క హింసల్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం ఎన్నో శాఖల ద్వారా వారికి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. మహిళలు ఏ సందర్భంలోనైనా లైంగిక ,మానసిక, శారీరక, ఆర్థిక వేధింపులను ఎదుర్కొంటున్నట్లయితే వారికి 181 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా వైద్య, న్యాయం, పోలీస్, కౌన్సిలింగ్, షెల్టర్ వంటి సహాయాల్ని అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళలకు ప్రభుత్వం ప్రత్యేకమైన రిజర్వేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు, మహిళలు ఆర్థికంగా ముందున్నడంవల్ల కుటుంబం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అదనపు కలెక్టర్ బిఎస్ లత మాట్లాడుతూ .. సీత దేవి 14, సంవత్సరాలు రాముని వెంట ఒక అడవిలో వనవాసం చేసిందంటే సీత దేవి ఎంత ధైర్యవంతురాలు అయితే ఆ అడవిలో రాముని వెంట ప్రయాణించిందని అన్నారు.లంక రాజ్యంలో రావణాసురుడు సీత దేవినీ బంధించిన ధైర్య సాహసాలతో ఆలంకలో రాముడు వచ్చి తీసుకెళ్తాడని నమ్మకంతో రాక్షస రాజ్యం లో అంత ధైర్యంగా ఉందని. ఇప్పటి మహిళలు చిన్న చిన్న సమస్యలకే సూసైడ్ చేసుకుంటున్నారని మరి మీరు కూడా ఏ సమస్య వచ్చిన ధైర్యంగా ఎదుర్కొని నిలబడి ఉండాలని మహిళా ఉద్యోగులకు తెలిపారు. శ్రీ అంటే ఆది శక్తి స్వరూపమని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిటిఓ, షఫీయ డి ఏవో , సుజాత, జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్యవతి , బీసీ వెల్ఫేర్ అధికారి, సుజాత, కమిటీ చైర్మన్ రచన ఆయా శాఖ అధికారులకు మహిళలు ఉద్యోగులు పాల్గొన్నారు.





# ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయండి

పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని కలెక్టర్ బి.సత్య ప్రసాద్ సూచించారు. జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఓల్డ్ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు పాంప్లెట్ పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రానున్న 10వ తరగతి పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుండి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఆరోగ్యానికి కాపాడుకోవాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు ప్రిపేర్ కావాలని తెలిపారు. రానున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ముఖ్యంగా పరీక్ష కేంద్రాల వద్ద (144) సెక్షన్ అమలు ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాలలో కావాల్సిన లైటింగ్, మరుగుదొడ్లు, తాగునీరు వంటి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రశ్నపత్రాలు పరీక్ష కేంద్రాలకు ప్రోటోకాల్ ప్రకారం తరలించడం, ప్రశ్న పత్రాలు లీక్ కాకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో మాస్ కాపీయింగ్ కాకుండా సీసీ టీవీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయని, వేసవికాలం నేపథ్యంలో విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్, మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యా అధికారి రాము, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.





# ఈవీఎం గోదాం కేంద్రం తనిఖీ

జిల్లాలో ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రతకు సంబంధించి ప్రతి నెలలో తనిఖీలో భాగంగా గురువారం ఈవీఎం గోడౌన్ ను గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నాయకులు, అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి సందర్శించారు. ఆర్డిఓ మధు సుధన్, ఎమ్మార్వో రాంమోహన్, తదితరులు పాల్గొన్నారు.





# భూసమస్యలపై తక్షణ చర్యలు

## మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



**కలంజ్యోతి, మంచిర్యాల :** జిల్లాలో శాంతిభద్రతలకు అవరోధంగా మారే భూ సంబంధిత సమస్యల పరిష్కారంపై తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారం దిశగా మండల, సబ్ డివిజన్, జిల్లా స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయి కమిటీలో తహశిల్దార్, ఎస్.హెచ్.ఓ.లు ఉంటారని, నివాస ప్రాంతాలు, నిర్మాణ అనుమతులు, సరైన అనుమతులు లేని అక్రమ కట్టడాలపై మండల పంచాయతీ అధికారి, మున్సిపల్ కమీషనర్లను ప్రత్యేక అధికారులుగా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల కమిటీ ప్రతినిధులు ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి రిజిస్టర్ వివరాలు నమోదు చేసి గ్రీవెన్స్ నంబర్ కేటాయిస్తారని తెలిపారు. దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారించడం జరుగుతుందని, కనీసం 15 రోజులు, గరిష్టంగా 21 రోజులలోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కోర్టులో పరిష్కారమయ్యే సమస్యలపై సంబంధిత అర్జీదారులకు అవగాహన కల్పించి తగు సూచనలు చేయడం జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలోని రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు కమిటీ సూచనలు అనుసరించాలని తెలిపారు. సబ్ డివిజన్ స్థాయిలో రాజస్వ మండల అధికారి, ఎ.సి.పి.లు ఉంటారని, మండల స్థాయి కమిటీ పనితీరును 15 రోజులకు ఒకసారి పరిశీలిస్తారని, సమస్యల పరిష్కారంలో మండల కమిటీకి తగు సూచనలు చేస్తారని, డివిజన్ స్థాయిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత మండల స్థాయి కమిటీకి సిఫారసు చేసి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. జిల్లా స్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్, డి.సి.పి. ఉంటారని, మండల, సబ్ డివిజన్ స్థాయి దరఖాస్తుల ప్రక్రియపై నెలవారి సమీక్ష నిర్వహిస్తారని, 21 రోజులలో పరిష్కారం కాని దరఖాస్తులను జిల్లా స్థాయి కమిటీకి పంపించాలని తెలిపారు. నకిలీ / తప్పుడు ధృవపత్రాలుగా అనిపించినట్లయితే తదుపరి చర్యల కొరకు జిల్లా స్థాయి కమిటీకి పంపించాలని తెలిపారు. కమిటీల సంబంధిత పనితీరు, ఫిర్యాదులు, సందేహాల నివృత్తి కొరకు జిల్లా స్థాయిలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసి 08736 250106 నంబర్ను అందుబాటులో ఉంచడం జరుగుతుందని, ప్రజలు తమ సమస్యలను కమిటీల ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కమిటీకి సంబంధించిన అధికారులు నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, విధులలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

### ఈత చెట్ల తొలగింపునకు అనుమతులు

జిల్లాలోని బెల్లంపల్లి మండలం బూదకలాన్ గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటులో భాగంగా ఈత చెట్ల తొలగింపు కొరకు అనుమతులు జారీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా అటవీ అధికారి శివ్ అశిష్ సింగ్తో కలిసి ఆబ్కారీ, మద్యనిషేధ, ఉద్యానవన, సింగరేణి, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బూదకలాన్ గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ కొరకు సింగరేణి స్థలంలో 464 ఈత చెట్ల తొలగింపు కొరకు సంబంధిత శాఖల నుండి అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. తొలగించిన చెట్లకు బదులుగా సింగరేణి భూములలో రెట్టింపు సంఖ్యలో మొక్కలు నాటాలనే నిబంధనతో అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈత చెట్లకు సంబంధించిన నష్టపరిహారం 50 శాతం భూమి యజమాని అయిన సింగరేణి సంస్థకు, 25 శాతం గీత కార్మికుల సొసైటీకి, మిగిలిన 25 శాతం ప్రభుత్వానికి అందించడం జరుగుతుందని, ఒకవేళ సొసైటీ మనుగడలో లేనట్లయితే ఆబ్కారీ, మద్య నిషేధ శాఖకు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆబ్కారీ, మద్యనిషేధ శాఖ పర్యవేక్షకులు నందగోపాల్, జిల్లా ఉద్యానవన అధికారి అనిత, డి సెక్షన్ పర్య వేక్షకులు అరవింద్, సింగరేణి సంస్థ సీనియర్ ఎస్టేట్ అధికారి నవనీత, ఫారెస్ట్రీ మేనేజర్ రమణారెడ్డి, డిప్యూటీ ఎస్.ఈ. ఆర్.నరేష్, జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్ ఎండి. ఆసిఫ్, బెల్లంపల్లి నాయబ్ తహసీల్దార్ కల్పన తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ విజయం ప్రజా విజయం

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

**కలంజ్యోతి, నిర్మల్ :** కరీంనగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి విజయం ప్రజా విజయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడంతో నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నివాసంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భం గా జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడిన ప్రతి ఒక కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. ఈ గెలుపు కార్యకర్తల గెలుపని అన్నారు. బీజేపీకి ఓటేసిన మేధావులకు, ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తాజా మాజీ జడ్పీటీసీ తక్కల రమణ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, నాయకులు పద్మాకర్, నవీన్, నరేందర్, శంకర్ పతి, గిల్లి విజయ్, రాజేష్, మార గంగారెడ్డి, నరేంద్ర చారి, నరేష్, భరత్, విజయ్ తో పాటు బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**మండల కేంద్రాల్లో...**

బీజేపీ అభ్యర్థుల విజయం నేపథ్యంలో నియోజకవర్గంలోని దిలావర్ పూర్, లక్ష్మణ చాంద, సారంగాపూర్, సోన్ మండలాల్లో కూడా విజయోత్సవ వేడుకలు నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు.

# లగచర్ల, హకీంపేట భూసేకరణపై హైకోర్టు స్టే

**కలంజ్యోతి, హైదరాబాద్ :** లగచర్ల , హకీంపేటలో తెలంగాణ ప్రభుత్వం చెపట్టిన భూసేకరణపై తక్షణమే స్టే విధిస్తున్నట్లు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బాధితుల తరఫున హకీంపేటకు చెందిన శివకుమార్ పిటిషన్ దాఖలు చేశారు. భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.17 లక్షలు, ఇందిరమ్మ ఇల్లు, డీటీసీపీతో కూడిన ఇంటి స్థలం, అర్హతను బట్టి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారని పిటిషన్లో పేర్కొన్నారు. అయినా రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు రాలేదని పేర్కొన్నారు. తమకు వ్యవసాయం చేయటం మాత్రమే వచ్చునని కోట్ల రూపాయల విలువైన భూములను ఎలా ఇస్తామని పిటిషన్లో తెలిపారు. ఈ పిటిషన్పై జస్టిస్ జే శ్రీనివాసరావు నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. భూ సేకరణపై లగచర్ల, హకీంపేట్ గ్రామాల్లోని నోటిఫికేషన్లో పేర్కొన్న మొత్తం 8 ఎకరాలపై కోర్టు అభ్యంతరం వ్యక్తం చేస్తూ స్టే ఉత్తర్వులు ఇచ్చింది. లగచర్ల, పోలేపల్లి, హకీంపేట్, పులిచర్లకుంట తండా, రోటిబండ తండాల పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం 1177 ఎకరాల భూసేకరణకు టీజీఐఐసీ ద్వారా ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. 534 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా 643 ఎకరాలు పట్టా భూమి ఉందని దుద్యాల తహసీల్దార్ కిషన్ కోర్టుకు వెల్లడించారు. వాదనలు పరిశీలించిన హైకోర్టు ధర్మాసనం కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశాలు జారీ చేసింది.

# ఇంటర్ పరీక్షకు 97 శాతం హాజరు

## జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య

**కలంజ్యోతి, మంచిర్యాల :** ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు మొదటి రోజున 97 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు సాధారణ 5 వేల 433 మంది హాజరు కావలసి ఉండగా 5 వేల 299 మంది, ఒకేషనల్ 638 మంది హాజరు కావలసి ఉండగా 615 మంది హాజరయ్యారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షా కేంద్రాలలో పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు.

# యువతి వివాహానికి బెంద్రం అండ

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలంలో రహీంఖాన్ పేట గ్రామంలో పేద కుటుంబానికి చెందిన తాడురి మల్లయ్య శంకరవ్వ కుమార్తె రజిత (అర్చన) లక్ష్మిరాజం వివాహానికి బెంద్రం తిరుపతిరెడ్డి అండగా నిలిచారు. రూ.10వేట విలువైన టేక్ మంచాలు, వస్తువులను బీటీఆర్ ఫౌండేషన్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఇల్లంతకుంట మండలంలోని నిరుపేద కుటుంబకు అండగా ఉంటున్నట్లు తెలిపారు. ఎవరైనా ఆర్థికంగా ఇబ్బంది పడుతూ కుమార్తెల వివాహాలకు ఇబ్బందిగా ఉంటే తనను నేరుగా కలువొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సేవా ప్రతినిధులు నాయకులు చుక్క రమేష్, పొనగంటి తిరుపతి, కముటం రాజిరెడ్డి, బొల్లారం పర్షారములు, తాడురి శ్రీనివాస్, గజ్జల శ్రీనివాస్, కర్ల లక్ష్మన్, ఏనుగుల రవి, ఏనుగుల మల్లయ్య, బత్తిని చంద్రయ్య, కట్ట లచ్చయ్య, బొంగోని శ్రీనివాస్, రాములు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.
















# ఘోర రోడ్డు ప్రమాదం

- మిర్చి ఏరేందుకు కూలీలువెళ్తుండగా ట్రాలీలో బోల్తా
- ఒక్కరు మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం
- ప్రమాద సమయంలో ట్రాలీలో 40 మంది కూలీలు
- మరో 20 మందికి స్వల్ప గాయాలు
- వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలో ఘటన

**కలంజ్యోతి, చెన్నారావుపేట :**

వరంగల్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పొట్ట కూటి కోసం మిర్చి ఏరేందుకు ట్రాలీలో కూలీలు వెళ్తుండగా.. అదుపు తప్పి ఆ ట్రాలీ బోల్తా పడింది. ఈ ప్రమాద సమయంలో ట్రాలీలో దాదాపు 40 మంది వరకు ఉండగా.. అందులో ఒకరు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఇద్దరు కూలీల పరిస్థితి విషమంగా ఉంది. మరో 20 మంది స్వల్ప గాయాలయ్యాయి. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జీడిగడ్డ తండాకు



చెందిన దాదాపు 40 మంది కూలీలు నర్సంపేట మండలం ఇటుకాలపల్లికి మిర్చి ఏరేందుకని బయలుదేరారు. ఎండాకాలం కావడంతో పొద్దటి కూలి కోసమని ఉదయం 6గంటల సమయంలోనే బయలు దేరగా.. చెన్నారావుపేట మండలం కోనాపురం శివారులో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జీడిగడ్డ తండాకు చెందిన బానోతు సూక్య(55) అనే వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య శాంతి, ఇద్దరు పిల్లలు మోహన్, సునీత ఉన్నారు. మరో ఇద్దరు కూలీలు ఈర్యా, దంగ్లీకి తీవ్ర గాయాలయ్యాయి. మరో 20 మంది కూలీలు స్వల్పంగా గాయపడ్డారు. కాగా స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఈర్యా, దంగ్లీలను హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. స్వల్పంగా గాయపడిన మరో 20 మంది కూలీలను వెంటనే నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### ఓవర్ లోడ్ కారణంగానే?

ప్రమాద సమయంలో ట్రాలీలో దాదాపు 50 మంది కూలీలు ఉన్నట్లు తెలిసింది. వాస్తవానికి నిబంధనలకు విరుద్ధంగా గూడ్స్ వెహికిల్ లో కూలీలను తరలించడం, అందులోనూ పరిమితికి మించి కూలీలను ఎక్కించడం వల్ల బండి అదుపు తప్పిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా.. కూలీల వాహనం బోల్తా పడటంతో వారివారి కుటుంబ సభ్యులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యుల రోదనలతో అక్కడ విషాద వాతావరణం నెలకొంది.

### తరచూ ఇవే ప్రమాదాలు..

కూలీల కొరత కారణంగా వివిధ వ్యవసాయ పనుల కోసం రైతులు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. ఈ మేరకు వారికి ప్రయాణ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. కానీ ప్రయాణానికి ఉపయోగించే వెహికిల్స్ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తుండటం, బండి ఫిట్నెస్ కూడా పట్టించుకోకపోవడం వల్ల తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి.

### బాధితులకు పరామర్శ..

ప్రమాద విషయం తెలుసుకున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బాధితులతో ఫోన్లో మాట్లాడారు. మృతి చెందిన భూక్య సూక్య కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. క్షతగాత్రులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, ఉప్పరపల్లి గ్రామ అధ్యక్షులు వట్టి తిరుపతి రెడ్డి పరామర్శించారు.